క్లుప్తంగా

నేడు పర్చూరులో ఆమంచి పర్యటన

పర్చూరు: మండల కేంద్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ గురువారం ఉదయం 8 గంటలకు పర్చూరులో పర్యటించి ప్రజలు తెలుసుకుంటారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ సిబ్బంది బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో ఆమంచి కృష్ణమోహన్ ప్రత్యేక పూజల్లో పాల్గొని.. అనంతరం పర్యటిస్తారన్నారు. మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అధికారులతో ఆమంచి సమీక్ష సమావేశం

మార్టూరు: నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ బుధవారం మధ్యాహ్నం మార్టూరులో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక గల సచివాలయంలో మాట్లాడుతూ డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలని, తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తున్న చెరువు వద్ద ఫిల్టర్‌బెడ్‌ల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీఓ జి. నితిన్, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాయి మందిర వార్షికోత్సవాలు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు సాయినగర్‌లో కొలువైన సాయిబాబా వారి మందిర 15వ వార్షికోత్సవాలను గురువారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరిగే ఈ వార్షికోత్సవ వేడుకల్లో అఖండ సప్త అర్ధ ఏకాహేకపర్యంత సాయి నామ సంకీర్తనలు, సప్తాహం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అష్టోత్తర పుష్పార్చన జరుగుతాయన్నారు. నిత్యపూజలు, అభిషేకాలు, సాయిపాదములకు అర్చనలు నిర్వహించదలచిన వారు తమ పేర్లను ముందుగానే నమోదు చేయించుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. చివరి రోజున పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీవారు తెలిపారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం మాఘ మాసం ఉత్తర నక్షత్రం చవతి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల అందజేత


అడుసుమల్లిలో కళ్లజోళ్లు పంపిణీ చేసిన రోటరీ క్లబ్ సభ్యులు

పర్చూరు: రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ వారి ఆధ్వర్యంలో అడుసుమల్లి జెడ్పీ స్కూల్‌లోని విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్‌లో తమ హైస్కూల్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు కోరారు. కార్యదర్శి పంబి సదానంద రెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రానైట్ వాహనాలు స్వాధీనం


అక్రమ గ్రానైట్ వాహనం

మార్టూరు: అక్రమంగా గ్రానైట్ శ్లాబులను తరలిస్తున్న రెండు లారీలను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె. కమలాకర్ బుధవారం తెలిపారు. స్థానికంగా ఓ గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న రెండు వాహనాలను ఎస్‌ఐ కమలాకర్ తమ సిబ్బందితో కలిసి జాతీయ రహదారి పై తనిఖీ నిర్వహించారు. ఎలాంటి అనుమతులు, బిల్లులు కానీ లేనందున రెండు లారీలను పోలీసు స్టేషన్‌కు తరలించి సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చైన్ స్నాచింగ్ కలకలం

పర్చూరు: మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించి విఫలమైన సంఘటన బుధవారం పర్చూరులో జరిగింది. స్థానికులు అందించిన వివరాల మేరకు పర్చూరుకు చెందిన ఒక మహిళ డ్వాక్రా డబ్బులు చెల్లించేందుకు స్టేట్ బ్యాంకుకు బయలుదేరగా, మార్గ మధ్యంలో ఎస్ మార్టు వద్ద మహిళ నిలబడింది. అక్కడికి బైక్‌పై వచ్చిన ఇద్దరు దొంగలు మహిళ మెడలో ఉన్న గొలుసుని లాక్కెళ్లేందుకు ప్రయత్నించగా గొలుసు తెగి మహిళ చేతిలో పడింది. ఆమె కేకలు వేయడంతో బైక్‌పై చీరాల వైపు పరారైనట్లు తెలిపింది.

లక్ష్యాలతో అభివృద్ధి సాధ్యం

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: ప్రభుత్వ పథకాల లక్ష్యాలు చేరుకొని, గ్రామాల్లోని ప్రాధాన్యత భవనాలు పూర్తి చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత సర్పంచ్‌లు, ఎంపీటీసీలపై ఉందని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ అన్నారు. బుధవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షత మండల సమావేశం జరిగింది. సమావేశంలో శాఖలవారీగా సమీక్షించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరినాయక్ మాట్లాడుతూ రాబోయే వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా మండలంలోని అన్ని నోటిఫైడ్ చెరువులను సాగర్ నీటితో నింపామని చెప్పారు. అసంపూర్తి రక్షిత పథకాలు పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చేందుకు మండలానికి రూ.13.2 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఈ నిధులతో గ్రామాలవారీగా మంచి నీటి ఇబ్బందులు తొలగిస్తామని చెప్పారు. వ్యవసాధికారి ఎస్‌వీపీ కుమారి మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ లోపు రబీలో పంటలు సాగు చేసిన రైతులంతా ఈ పంట నమోదు చేసుకోవాలని కోరారు. ఎంఈవో బి. వీరరాఘవయ్య మాట్లాడుతూ మండలంలోని 55 పాఠశాలలు ఉండగా 46 పాఠశాలలను నాడునేడులో అభివృద్ధి పరిచామని మార్చి 1 నుంచి విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల బోధనతోపాటు ఒత్తిడిలేని విద్యను అందిస్తున్నారని బడిఈడు కలిగిన బాలబాలికలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. గృహనిర్మాణ శాఖ ఏఈ దుర్గారమేష్ మాట్లాడుతూ మండలానికి 640 గృహాలు మంజూరవగా 416 గృహాలు గ్రౌండింగ్ పూర్తయ్యాయని 176 గృహాలు మాత్రమే పూర్తయ్యాయని మార్చి 22 లోపు మంజూరైన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. లేదంటే ప్లాటు, ఇల్లు రద్దవుతాయని వివరించారు. ఈవోఆర్డీ జి. సీతామహాలక్ష్మి మాట్లాడుతూ గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అప్పుడే ప్రజలు ఆరోగ్యవంతంగా జీవిస్తారని, రోడ్ల వెంట ఎరువు దిబ్బలు, వ్యర్థాలు వేయకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి రమీజ్ అహ్మద్, పశువైద్యాధికారిణి ఆర్. పావని కుమారి, వెలుగు ఏపీయం బి. సురేంద్ర బాబు, ఎపీవో బాలకృష్ణ నాయక్, పీఆర్‌ఏఈ హనుమంతరావు, జెడ్పీటీసీ చింతల అంజలి, మండల ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ మాట్లాడారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి


స్వర్ణలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ

స్వర్ణ (కారంచేడు): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రసవాలను మరింత పెంచేలా వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. విజయమ్మ అన్నారు. బుధవారం స్వర్ణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పేషెంట్లకు సరైన వసతులు లేక ఇక్కట్లు పడుతున్నారని సిబ్బంది తెలపగా, ఇక్కడ 6 పడకల భవనం నిర్మాణం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం సచివాలయం–1లో జరుగుతున్న ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌తో పాటు, ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. డాక్టర్ విక్టర్‌పాల్, డాక్టర్ షాలినీ, 104 వైద్యురాలు డాక్టర్ ప్రియ, హెచ్‌ఈ మీనాకుమారి, బయ్యా శంకర్, స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కారంచేడు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఎన్‌సీడీ సీడీ సర్వేను నూరు శాతం చేయాలని సూచించారు. డాక్టర్ జెస్సీరాణి, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

మేలు జాతి దూడల సంరక్షణ ముఖ్యం

చీరాల టౌన్: మేలుజాతి దూడల సంరక్షణను పశుపోషకులు సక్రమంగా నిర్వహించడం వలన పశు సంపద వృద్ధి చెందడంతో పాటు పశుపోషకులకు ఆదాయం వస్తుందని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు సూచించారు. బుధవారం ఈపూరుపాలెం పశువైద్యశాల పరిధిలోని బోయిన వారిపాలెంలో పశువైద్యులు పావని ఆధ్వర్యంలో మేలుజాతి దూడల ప్రదర్శన, దూడల సంరక్షణపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పశువైద్యాధికారి హనుమంతరావు మేలుజాతి దూడల ప్రదర్శన ప్రారంభించి మాట్లాడారు. క్రమంతప్పకుండా టీకాలు వేయించడంతో పాటు పోషక ఆహారాన్ని అందించాలన్నారు. దూడల ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందించారు. ఈవోడీఎల్‌డీఏ డాక్టర్ కాలేషా, డివిజినల్ డీడీ డాక్టర్ రమేష్, ఏరియా వెటర్నరీ హాస్పిటల్ ఏడీ డాక్టర్ చిట్టిబాబు, పశువైద్యురాలు పావని, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన


ఆదిపూడిలో ఎండీం పరిశీలిస్తున్న ఎంఈఓ

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన, రుచికరమైన, పౌష్టికాహారం అంతుందని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. బుధవారం ఆదిపూడి అరుంధతీనగర్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. పాఠశాలల నిర్వహణలో ఉపాధ్యాయులు అలక్ష్యంగా ఉండవద్దన్నారు. ప్రతి రోజూ సమయపాలన పాటించడంతో పాటు, అసెంబ్లీ నిర్వహించుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రకారం తరగతులను నిర్వహించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పోషక విలువలుండే ఆహారం అందిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. హెచ్‌ఎం జీఎన్ ప్రసాద్, ఉపాధ్యాయులు,విద్యార్థులుకుకింగ్‌నిర్వాహకులు పాల్గొన్నారు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చినగంజాం: కడవకుదురులో గ్రామంలో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీలుసు బుధవారం ఉదయం పట్టుకున్నారు. ఎస్‌ఐ కట్టా అనూక్ తెలిపిన వివరాలు ప్రకారం కడవకుదురులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ డ్రైవర్, యజమాని ఆరిగ తిరుమలరావును అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

న్యాయవాదులకు సౌకర్యాలు

చీరాల రూరల్: న్యాయవాదులకు ఏవిధమైన అసౌకర్యం లేకుండా స్థానిక ఏడీజే కోర్టుతో అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా ఉన్నత న్యాయస్థానానికి విన్నవిస్తామని ఆంధ్ర ప్రదేశ్ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కె. రామ జోగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన చీరాల విచ్చేసిన సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాగంటి జ్ఞానేశ్వరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు కరేటి రవికుమార్ రెడ్డి, తాటికొండ సాయిబాబు, బండారుపల్లి హేమంత కుమార్, ఎంవి. చలపతిరావు, కొమ్మనబోయిన నాగేశ్వరరావులు న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చీరాల కోర్టుల్లో అధిక సంఖ్యలో కేసులున్నాయని అదనపు కోర్టు ఏర్పాటు అవసరం ఉందన్నారు. అలానే 41 ఏ స్టేషన్ బెయిల్ వలన న్యాయవాదులకు అన్యాయం జరుగుతోందని, పోలీసులు ముద్దాయిలకు స్టేషన్ బెయిల్ ఇవ్వడం వలన కక్షిదారులకు, ముద్దాయిలకు న్యాయవ్యవస్థపై ఏ మాత్రం గౌరవం ఉండడంలేదని, తక్షణమే 41 ఏను రద్దు చేయాలని విన్నవించారు. అలానే కొత్తగా న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో ఎన్రోల్ చేసుకునే సందర్భంలో 35 ఏళ్లు దాటిన న్యాయవాదికి వెల్ఫేర్ ఫండ్ వచ్చే అవకాశం లేదని దీని వలన ఎంతోమంది న్యాయవాదులు నిరాశకు గురవుతున్నారన్నారు. 36 సంవత్సరాల వయస్సు వారికి కూడా వెల్ఫేర్ ఫండ్‌కు అవకాశం ఇవ్వాలని విన్నవించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ నీలి కస్తూరి నాథ్, సభ్యులు మేరుగ రవికుమార్, సిరిపురపు కామేశ్వరరావు, అందె వెంకటేశ్వరరావు, షేక్ సిరాజ్, మహిళా ప్రతినిధి ఎస్‌డీ కరుణ కుమారి పాల్గొన్నారు.

వైభవంగా గంధ ఉత్సవం

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని ఏల్చూరులో బుధవారం రాత్రి నిర్వహించిన హజరత్ కాలే మస్తాన్‌వలి గంధ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎలక్ట్రిక్ ప్రభలపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పురాతన మసీదును ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రభల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై నాగ శివారెడ్డి, ఇన్‌చార్జి సీఐ ఎస్‌కే ఫిరోజ్ పర్యవేక్షించారు.

విద్యుత్ పెనాల్టీ రూ.1.49 లక్షలు

అద్దంకి రూరల్: ఈనెల 2 నుంచి 8 రకు విద్యుత్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అక్రమ వినియోగదారులు 40 మందికి రూ.1,49, 600 పెనాల్టీ విధించినట్లు ఈఈ ఎస్. మస్తాన్‌రావు తెలిపారు. బుధవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం నేరమన్నారు. డీఈఈ టి.సత్యనారాయణ, ఏఈఈ ఆర్‌ఎస్‌వీవీ ప్రసాద్, డీఈఈ టి. హైమావతి, ఏఈఈ బి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో విజిలెన్స్ తనిఖీలు

చీరాల రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బుధవారం విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు ఆధ్వర్యంలో బుధవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. రోగులకు ఎటువంటి సౌకర్యాలు కల్పిస్తున్నారనే విషయమై వారు ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ శేషకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సీఐ శ్రీహరిరావు మాట్లాడుతూ ఆయుష్ విభాగంలో మందులు కొరత ఉందని చెప్పారు. రెగ్యులర్‌గా రోగులకు అందించే మందులు మామూలు కంటే అధికంగా ఉన్నాయని దాని వలన రోగులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. ఏఈ పి.వి.ఎస్. నాగేశ్వరరావు, విజిలెన్స్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.కె. సైదులు, డాక్టర్ రాధాకృష్ణ ఉన్నారు.

98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల హర్షం

పర్చూరు: రాష్ట్రంలో 98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలపటం పట్ల వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జా సరేష్, దండమూడి శాంతారావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థపై ఎనలేని కృషి చేస్తున్నారని గత 30 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న వారికి ఇది తీపి కబురన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీసుకొని వెళుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపారు. పోస్టులను భర్తీ చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ టి.కల్పలతా రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఆశ కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పర్చూరు: గ్రామ పంచాయతీ పరిధిలోని పర్చూరు-2 సచివాలయంలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని దగ్గుబాడు పీహెచ్‌సీ వైద్యులు బి.స్రవంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి వయస్సు 25 నుంచి 45 ఏళ్ల లోపు ఉండాలని, పదో తరగతి పాస్ అవ్వాలని, స్థానికులై ఉండాలని తెలిపారు. పూర్తి బయోడేటాతో దరఖాస్తులను ఈ నెల 9 నుంచి 12వ తేదీ లోపు దగ్గుబాడు పీహెచ్‌సీలో అందజేయాలన్నారు.

ఆశా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఇంకొల్లు (చినగంజాం): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఇంకొల్లు 1, వంకాయలపాడు సచివాలయ పరిధిలో ఆశ కార్యకర్తల పోస్టులు రెండు ఖాళీగా ఉన్నట్లు ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ టి. అంజలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఇంకొల్లు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ కోటేశ్వరరావును కలిసి అప్లికేషన్ పూర్తి చేసి, బయోడేటా, జెరాక్స్ సర్టిఫికెట్లు జతపరచి ఇంకొల్లు పీహెచ్‌సీలో ఈ నెల 11 లోపు అందజేయాలని తెలిపారు.

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

చీరాల టౌన్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇంటి పట్టా పొందిన ప్రతి లబ్దిదారులు ఇంటినిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ ఎ.రామగోవింగరెడ్డి సూచించారు. దేవాంగపురి, రామకృష్ణాపురం, సాల్మన్‌సెంటర్ పంచాయతీల్లో జగనన్న లే అవుట్‌లో ఇంటిపట్టాలు పొందిన లబ్దిదారులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద సొంత ఇంటిని అందించేందుకు ఇంటిపట్టాలు అందించి నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, సెక్రటరీలు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

17న చీరాలలో మెగా జాబ్ మేళా

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17న స్థానిక ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ బుధవారం తెలిపారు. జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆవిష్కరించారు. జాబ్‌మేళాకు పలు ప్రముఖ జాతీయ కంపెనీలు హాజరవుతున్నాయని, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమో, ఫార్మసీ, పీజీ విభాగాలలో చదువుకున్న 18–35 సంవత్సరాల నిరుద్యోగ యువతీ యువకులు వారి పూర్తి బయోడేటాతో హాజరుకావాలన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లు జెరాక్స్, ఆధార్, పాస్‌పోర్టు ఫొటోతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వివరాలకు 9346280289, 8555901198 నంబర్లుకు సంప్రదించాలన్నారు.

ఫిజియోథెరపీతో స్వస్థత

బల్లికురవ: వైకల్యం కలిగిన 14 ఏళ్ల లోపు చిన్నారులతో నిత్యం వ్యాయామం, ఫిజియోథెరపీతో స్వస్థత అందిచవచ్చని ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని అన్నారు. బుధవారం వైదనలోని భవిత కేంద్రంలో 10 మంది చిన్నారులకు పరీక్షలు చేశారు. పౌష్టికాహారం అందించాలని సూచించారు.

చందలూరు విద్యార్థుల సత్తా

జె.పంగులూరు: గత నెల 29న ఇంకొల్లు రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ వారు మూఢనమ్మకాల నిర్మూలన, సైన్స్ వల్ల ఉపయోగాలు, శాస్త్రీయ దృక్పథం, భారత రాజకీయాల్లో లౌకిక వాదం.. అనే అంశాపై డిబేట్, ఎస్సే రైటింగ్ ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పంగులూరు, ఇంకొల్లు మండలాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. చందలూరు విద్యార్థులు అన్ని పోటీల్లో ప్రతిభను చాటారు. డిబేట్ జూనియర్స్ విభాగంలో రిషిక్ మారుతి రెండో బహుమతి సాధించింది. వ్యాసరచన జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి సిరి సంజన, రెండో బహుమతి జాహ్నవి, సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతి రూపశ్రీ, రెండో బహుమతి చంద్రిక సాధించిట్లు బుధవారం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌పై దాడి

అద్దంకి రూరల్: విధులు నిర్వహిస్తున్న కరెంట్ లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మేన్‌పై ఓ ఇంటి యజమాని దాడిచేసిన సంఘటన బుధవారం మండలంలోని కలవకూరు గ్రామంలో చోటు చేసుకుంది. లైన్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఆదిలక్ష్మి కేసు నమోదు చేశారు. డీఈ ఆదేశాల మేరకు డివిజన్‌సు రైట్స్‌లో భాగంగా లైన్ ఇన్‌స్పెక్టర్, ఎస్. వెంకటేశ్వర్లు, లైన్‌మెన్‌లు మండలంలోని కలవకూరు గ్రామానికి వెళ్లారు. మీటర్లు చెకింగ్‌లో భాగంగా పల్లె ఆదిరెడ్డి ఇంటికి వెళ్లటంతో ఆగ్రహంతో విద్యుత్ అధికారులను బూతులు తిట్టి.. అడ్డమైనవారు వచ్చి రాసుకుని పోయి పెనాల్టీలు వేస్తారంటూ, లైన్ ఇన్‌స్పెక్టర్‌పై కర్రతో దాడికి పాల్పడ్డాడు. అడ్డువచ్చిన లైన్‌మేన్‌ను కొట్టాడు.

యువ క్రీడాకారుల ప్రతిభకు 'సాక్షి' కృషి


విజేతలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

చీరాల: యువ క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు సాక్షి చేస్తున్న కృషి అభినందనీయమని చీరాల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.రవికుమార్ అన్నారు. సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జూనియర్స్ విభాగంలో చీరాల ఇంజినీరింగ్ కాలేజీ పాలిటెక్నిక్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ నిబంధనలతో అనుభవం కలిగిన అంపైర్లతో నిర్వహించిన ఈ టోర్నమెంట్ యువ క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చూపడానికి ఇది చక్కని వేదిక అన్నారు. సాక్షి ఆధ్వర్యంలో మరిన్ని ప్రజా ప్రయోజన కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. పీడీ కె.శ్రీనివాసరావు, మహాలక్ష్మి, మణికంఠ, రామకృష్ణ పాల్గొన్నారు.

కొత్తూరులో పశువైద్య శిబిరం


కొత్తూరులో దూడకు చికిత్స చేస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: వసతిలేని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు ఉచిత వైద్య సేవలు అందించటంలో తృప్తి ఇస్తుందని వల్లభ డైరీ జీయం సీహెచ్ శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం కొత్తూరులో ఉచిత వైద్య శిబిరంలో భాగంగా 102 పశువులకు సాధారణ, 106 దూడలకు చికిత్సలతో పాటు 152 పశువులకు సూడి పరీక్షలు చేశారు. జీయం మాట్లాడుతూ పాలసేకరణలో భాగంగా పశుపోషకులకు తోడ్పాటునిస్తున్నట్లు చెప్పారు. డైరీ మేనేజర్ బాలకృష్ణ, వైద్యాధికారి హనుమంతరావు, వెటామ్యాక్స్ కంపెనీ జీయం శ్రీకాంత్ శ్రీధర్, డైరీ ఎజంట్ భవాని పాల్గొన్నారు.

ఆలయ సంపదను పరిరక్షించుకోవాలి


ఈఓపై ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు


రథశాల నిర్మాణానికి రూ.6.70 లక్షల చెక్‌ను అందజేస్తున్న దాత రాటకొండ హనుమంతురావు

యద్దనపూడి: సనాతన సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ చారిత్రాత్మక సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ పానకాలరావు అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని పూనూరు గ్రూపు దేవాలయాలను ఆయన సందర్శించారు. తొలుత గ్రామంలోని త్రిపురాంతక స్వామి, వేణుగోపాలస్వామి , చెరువును పరిశీలించారు. ఆలయం చుట్టూ వ్యర్థాలు ఉండటంతో వెంటనే తొలగించాలని అలాగే ఆలయం చుట్టూ సీసీ కెమెరాలను అమర్చాలని ఈఓ జ్యోతికుమారికి సూచించారు. అలాగే గత సంవత్సరం కోటిరూపాయల వ్యయంతో నిర్మించిన రథానికి సంబంధించి రథశాల నిర్మాణానికి దాత రాటకొండ హనుమంతురావు రూ.6,70 లక్షల కాంట్రిబ్యూషన్ చెక్‌ను, అలాగే లక్ష రూపాయల విలువైన తొమ్మిది స్టాండ్ ఫ్యాన్లను సహాయ కమిషనర్ పానకాలరావు సమక్షంలో ఈఓ జ్యోతికి అందజేశారు. పూనూరు గ్రూపు దేవస్థానానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు ఖాతాలో ఉన్న దేవాదాయశాఖ నిధులను బ్యాంకు నుంచి డ్రా చేస్తున్నట్లు గుర్తించారు. పూర్తి స్థాయిలో ఆలయాల మాన్యం భూములకు సంబంధించిన కౌలు తాలుకా నగదు సకాలంలో వసూలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించారు. ఈఓను బకాయిలకు సంబంధించి తాకీదులు ఇచ్చినా స్పందించని వారిపై కోర్టులో వ్యాజ్యం ఎందుకు దాఖలు చేయలేదని ఈఓను ప్రశ్నించారు. గ్రామస్తులు పూర్తి స్థాయిలో కౌలు వసూలు చేయకుండా ఈఓ జ్యోతి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఆలయ నిధులు చాలా అవకతవకలకు పాల్పడినట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కొన్ని రికార్డులు ఆడిట్ కోసం పంపినట్లు తెలుసుకొని పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించి అవకతవకలకు పాల్పడితే సదరు ఈఓపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ దేవాదాయ శాఖకు సంబంధించి ఖాతాలున్న బ్యాంకు అధికారులకు అనుమతిపత్రం లేకుండా నగదు చెల్లించవద్దని బ్యాంకు అధికారులకు లేఖలు పంపనున్నట్లు తెలిపారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శైలేంద్రకుమార్, రికార్డు అసిస్టెంట్ రామకృష్ణ, ఆలయ అర్చకులున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు


ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే శనగ పంట పరిశీలిస్తున్న దృశ్యం

పర్చూరు: మండల పరిధిలోని అడుసుమల్లి, బోడవాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల పొలాలను జర్మనీ డెవలప్‌మెంట్ బ్యాంకు సభ్యురాలు ఐరీస్ హర్డర్, రైతు సాధికారిత సంస్థ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. అడుసుమల్లి రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించి రైతుభరోసా కేంద్రం ద్వారా రైతులకు అందుతున్న సేవలను తెలుసుకొని ఫొటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. కషాయాల తయారీ గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. బాపట్ల డీపీఎం వాణిశ్రీ, సీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

షటిల్ క్రీడాకారునికి అభినందనలు


తుపాకుల నాగేశ్వరరావును సన్మానిస్తున్న డాక్టర్‌బాబూరావు, క్రీడాకారులు

చీరాల: ఈ నెల 2 నుంచి 5 వరకు ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో చీరాలకు చెందిన క్రీడాకారుడు తుపాకుల నాగేశ్వరరావు 70 సంవత్సరాల వయస్సులో విశేష ప్రతిభ చూపి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. బుధవారం చీరాల ఇండోర్ స్టేడియంలో నాగేశ్వరరావును రోటరీక్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాబూరావు, షటిల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. 70 ఏళ్ల విభాగంలో ఉత్తమ ప్రతిభ చూపి.. యువ క్రీడాకారులకు సైతం తుపాకుల ఆదర్శంగా నిలిచారన్నారు. మార్చిలో గోవాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభచూపి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.